క్లుప్తంగా

31న సంగీత కచేరి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు సేవాసమితి కన్వీనర్ రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5.30గంటలకు వేదం, 6గంటలకు భజన, 6.30గంటల నుంచి హైదరాబాద్ మీర్పురి కళాశాల విద్యార్థులచే సంగీత విభావరి ఉంటుందన్నారు. అనంతరం మహామంగళహారతి, స్వామి ప్రసాదం నివేదన ఉంటుందని సాయి బంధువులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత



దేవరకద్ర: అడవి అజిలాపూర్‌లో పేద కుటుంబానికి చెందిన ఉదండి సత్యమ్మ కుమార్తె హారిక వివాహానికి జీకేఆర్ ఫౌండేషన్ వారు తమ వంతుగా అండగా నిలిచారు. పెళ్లి కుమార్తెకు పుస్తె, మెట్టెలతో పాటు వస్త్రాలను గురువారం అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, నవ్య దంపతులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండల పరిధిలోని దోండ్లపల్లి గ్రామానికి చెందిన చాకలియాదయ్య కుమార్తె శ్రావణి వివాహానికి గురువారం దోండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి ఆర్థికసాయం చేశారు. రూ. 10వేలను అందించడంతో ఆయనను గ్రామస్తులు అభినందించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు రంజిత్‌గౌడ్, వంశీగౌడ్, మురళీధర్, బాల్‌రాం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బైక్ దహనం కేసులో వ్యక్తికి రిమాండ్

నవాబుపేట: బైక్ దహనం చేసిన ఘటనలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొండాపూర్‌కి చెందిన అప్పన్న తన ఇంటి ముందు బైక్‌ను ఎప్పటి మాదిరిగా పార్క్‌చేసి నిద్రపోగా అదే గ్రామానికి చెకందిన వడ్డె వినోద్‌కుమార్ సదరు వాహనాన్ని దహనం చేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జంగయ్య



జడ్చర్ల టౌన్: పట్టణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉదయరాజు అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యవర్గం అంతా ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఆయన వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులుగౌడ్, కోశాధికారి శ్రీశైలం, కార్యదర్శి రాములు, గ్రంథాలయ కార్యదర్శి అమీనుద్దీన్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, రఘురాం, హఫీజ్‌బీ ఎన్నికైనట్లు వివరించారు. నూతన అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని ప్రకటించారు.

సీఎం సోదరుడికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా ఆయనను ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

పాలమూరు: బీసీ కమిషన్‌కు రాజ్యాధికార హోదా కల్పించిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందని, క్యాబినెట్‌లో 27మంది బీసీ మంత్రులు ఉన్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నారాయణ యాదవ్, శంకర్, రవికుమార్, తరుణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

రాజాపూర్: మండలపరిధిలోని దోండ్లపల్లికి చెందిన యువతి అక్షిత అదృశ్యమైంది. తల్లిదండ్రులతో పాటు ఇంటి మిద్దెపై నిద్రకు ఉపక్రమించిన ఆమె గురువారం తెల్లవారుజామున కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు చుట్టుపక్కలా, బంధువుల ఇళ్ల వద్దా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి వివరించారు.

ప్రశాంతంగా పోలింగ్



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పోలింగ్ బాక్స్‌లతో అధికారులు

- మహబూబ్‌నగర్‌లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్న 245మంది
- భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ



పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది

పాలమూరు: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. ఉదయం 11గంటల వరకు నత్తనడక కొనసాగిన పోలింగ్ ఆ తర్వాత వేగం పుంజుకొంది. క్యాంపులకు తరలిన వారు నేరుగా వాహనాల్లో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఆయా పార్టీల నేతలు ఓటర్లను ప్రలోబపెట్టడానికి ప్రయత్నాలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటర్లు వేరు వేరు బృందాలుగా వచ్చారు. మున్సిపాలిటీలో ఉన్న ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఓటు సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల విధానాన్ని కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిలు పర్యవేక్షించారు. కలెక్టర్ జి.రవినాయక్ పరిశీలించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఎన్నికల కమిషన్ నియమించిన సాధారణ పరిశీలకురాలు వాణి ప్రసాద్, రిటర్నింగ్ అధికారి జి.రవినాయక్ పర్యవేక్షణలో ఎన్నికలు సాగాయి.

భారీ భద్రత

ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భారీ భద్రత కల్పించింది. జెడ్పీ కమాన్ దగ్గర బారికేడ్స్ ఏర్పాటు చేసి ఓటర్లకు మాత్రమే అనుమతి కల్పించారు. అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. శిక్షణ ఎస్పీ చిత్తరంజన్ బందోబస్తును తనిఖీ చేశారు. 150 మంది సిబ్బంది పాల్గొన్నారు.

❒ మహబూబ్‌నగర్ పోలింగ్ కేంద్రంలో ఉదయం 10గంటల వరకు 27ఓట్లు పోల్ కాగా 11.20శాతంగా నమోదైంది. మధ్యాహ్నం 12గంటల వరకు 132ఓట్లు(53.87శాతం), 2గంటల వరకు 229ఓట్లు(93.46శాతం), సాయంత్రం 4గంటల వరకు 245ఓట్లు (వంద శాతం) వేశారు.

గత ప్రభుత్వంలో అన్ని ఏకపక్షాలే..

ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వంలో దరఖాస్తులు చేసుకుంటే దారుణంగా అనర్హులుగా చేసి ఏకపక్షంగా చేసే వారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్న తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల పాలన కొనసాగుతుందన్నారు. మహబూబ్‌నగర్‌లో గతంలో రౌడీయిజం జరిగిందన్నారు. ఒకపక్క క్రిమినల్ ఉంటే, మరో పక్క సేవా గుణం ఉన్న మన్నె జీవన్‌రెడ్డి పోటీ పడుతున్నారన్నారు. ఆ క్రిమినల్ కోసం గోవాకు వెళ్లి డ్యాన్సులు చేసిన వీడియోలు బయకు వచ్చాయని తెలిపారు.

దిగజారుడు రాజకీయాలు : యెన్నం

దేశంలో ప్రధానిగా గెలుస్తాం. మా తడాఖా చూడండి అని చెప్పిన వాళ్లు..చిన్న ఎమ్మెల్సీ ఎన్నిక కోసం గోవాలో క్యాంపు రాజకీయాలతో దిగజారడం సిగ్గుచేటని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోవాకు పోతే ఏం చేస్తారో ప్రజలకు తెలుసునని అలాంటి దాంట్లో యువరాజు పాలు పంచుకున్నాడా అనేది తెలియాలన్నారు. బీఆర్ఎస్‌కు పాతకాలం వాసనలు పోలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థితో విజయం సాధిస్తారన్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మీడియా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల బలోపేతానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతోఉందన్నారు. బీఆర్ఎస్ ఏనాడు ఎంపీటీసీ సభ్యులను మనుషులుగా కూడా గుర్తించలేదన్నారు. తాము వారి గౌరవాన్ని కాపాడేందుకు కృషిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన భరోసాతో రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు సైతం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 12 మంది ఎమ్మెల్యేలు ఎవరూ కూడా క్యాంపు రాజకీయాలు చేయలేదని, కల్వకుంట్ల వారసుడు మాత్రమే క్యాంపు నిర్వహించారన్నారు. ఫోన్ ట్యాపరింగ్‌పై నిజాయితీగా ఇబ్బందిపడిన బాధితులు ఎవరైనా ఉంటే సిట్ బృందానికి గానీ, స్థానిక ఎస్పీలకు ఫిర్యాదు చేయాలని, అలాంటి వారి వెంట తాను ఉంటానని తెలిపారు.

గెలుపు మాదే..

మహబూబ్‌నగర్ ఉప ఎమ్మెల్సీ ఎన్నికలో రెండు ప్రధాన అభ్యర్థులతో పాటు ఒక స్వతంత్ర్య అభ్యర్థి బరిలో ఉన్నారని దీంట్లో బీఆర్ఎస్ అభ్యర్థిదే విజయమని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఓటు వినియోగించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. గడిచిన ఎమ్మెల్యే ఎన్నికల్లో చిన్న చిన్న పొరపాట్ల వల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసుకోలేకపోయామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి సత్తా చాటుతామని తెలిపారు.

ఓటు వేసిన ఎంపీటీసీ సభ్యులు



ఓటువేసిన అనంతరం సింబల్ చూపుతున్న రంగారెడ్డిగూడ, ముదిరెడ్డిపల్లి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు

రాజాపూర్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎంఎల్‌సీ ఎన్నికల్లో రాజాపూర్ మండల ఎంపీటీసీ సభ్యులు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, ముదిరెడ్డిపల్లి, తదితరగ్రామాల ఎంపీటీసీలతో పాటు జెడ్పీటీసీ మోహన్‌నాయక్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే క్యాంప్‌లకు వెళ్లిన నాయకులు నేరుగా వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఆస్పత్రి నుంచి పోలింగ్ కేంద్రానికి..



ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యశ్రీ

నవాబుపేట: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమ్మపూర్ ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యశ్రీ గురువారం పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. తాను ఓటు వేయాలని కచ్చితంగా వివరించటంతో మండల అధికారులు ఆమెకు పోలింగ్ పత్రం అందించారు. మండలంలో 15 మందికి గానూ ఒకరు మృతి చెందగా 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఒక జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి సైతం ఓటు వేశారు.

లెప్రసీ బాధితులను గుర్తించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డా. జరీనా

భూత్పూర్: వైద్య సిబ్బంది గ్రామాలల్లో ఇంటింటా తిరిగి బాధితులను గుర్తించాలని ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జరీనా ఆదేశించారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పలు విషయాలపై ఆరాతీశారు. 80 మందిని పరీక్షించగా కుష్టు సంక్రమించకపోగా, చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించారు. రోగులకు తగిన చికిత్స అందించాలని, కుష్టు లక్షణాలు ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి నర్సింహారెడ్డి, హన్మంత్ రావు, సీహెచ్‌వో ఆయూబ్ ఖాన్, సూపర్ వైజర్లు యాదమ్మ, సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారంగా మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం న్యూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది మాదిగలు ఉన్నారని, ఈ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాదిగలకు రెండు స్థానాలు కేటాయించాలని డిమాండ్‌చేశారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవికి కంటోన్మెంట్ పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని కోరారు. మాదిగ జేఏసీ వనపర్తి జిల్లా కన్వీనర్ కృష్ణ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

బాలానగర్: మండల కేంద్రంలో చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం నగదును సీజ్ చేశారు. నారాయణపేట్ జిల్లాకు చెందిన ఖాజా మోయినొద్దీన్ వద్ద రూ.80 వేలు పట్టుబడినట్లు ఎస్‌ఐ తిరుపాజీ వివరించారు.



టీహబ్‌ను సందర్శించిన విద్యార్థులు



టీహబ్ వద్ద విద్యార్థులు, అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు గచ్చిబౌలిలోని టీ హబ్‌ను గురువారం సందర్శించారు. కళాశాల టీఎస్‌కేసీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు హబ్‌కు వెళ్లారు. యాత్రలో భాగంగా టీహబ్ ఉద్యోగులు సుదర్శన్, హరీష్‌లు విద్యార్థులకు పూర్తి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధిపతి డా.మంజుల, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డా.రమాదేవి, అధ్యాపకులు వెంకట్‌రెడ్డి, వనిత, శంకర్, మార్గదర్శకులు ప్రతాప్‌లతోపాటు 40మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ వైపు యువత చూపు

పాలమూరు: ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పాలమూరు యువత చూపు బీజేపీ వైపు ఉందని, స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన యువత గురువారం జిల్లాకేంద్రంలో డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ సుపరిపాలన, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా చేరికలు జరుగుతున్నట్లు తెలిపారు.



ముస్లింల సంక్షేమానికి కృషి



ఇఫ్తార్‌లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తుందని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో యునైటెడ్ ముస్లిం అడ్వయిజరీ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముస్లింలకు ఖజూర్, పండ్లు తినిపించారు. షాసాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాక్‌షా ఖాద్రీ, ఫోరం కన్వీనర్ గులాం గౌస్, కోకన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షిటీం పోలీసులు

మరికల్: సమాజంలో మహిళలను వేధించిన ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షిటీం ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు సామాజిక అంశాలు, బాల్యవివాహాలు, బాలకార్మికుల వ్యవస్థ, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాలలో కాని విద్యార్థినులకు వేధింపులకు గురిచేసిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళలు షిటీం పోలీసులను సంప్రదించాలని సూచించారు. హెల్ప్‌లైన్‌కోసం నంబర్ 8712670398, 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మామపై అల్లుడి దాడి

జడ్చర్ల: మామపై అల్లుడు దాడి చేసిన ఘటనపై గురువారం కేసునమోదైంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు...నసరుల్లాబాద్ తండాకు చెందిన సబావత్ లోక్య కుమార్తె మౌనిక, అల్లుడు సురేష్‌లు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం కోడుపర్తి నుంచి సోమవారం వచ్చారు. అనంతరం సురేష్, మౌనికతో గొడవ పడ్డాడు. పిల్లలను తీసుకుని తమ గ్రామానికి వెళ్లేందుకు బయలు దేరాడు. కాగా పిల్లలకు భోజనం తినిపించి తీసుకెళ్లాలని సూచించగా మామ లోక్యపై కర్రతో దాడి చేశాడు. ఘటనలో అతడి మూతిపై కొట్టడంతో పళ్లు ఊడిపోయాయి. ఈ మేరకు గురువారం బాధితుడ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయ సేవలు మరువలేనివి

మాగనూర్: ఉపాధ్యాయ సేవలు మరువలేనివని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. దాదాపు 33సంవత్సరాల పాటు విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం శివరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, వెంకటయ్య, ఉపాధ్యాయులు తిరుపతి, తిమ్మన్న, నరేందర్, దీప, విశాలక్షి తదితరులు పాల్గొన్నారు.

నీటిగోస తీరేనా?



జల గోస

వెలుగొమ్ములలో నీటి కోసం ఎదురు చూస్తున్న స్థానికులు

మిడ్జిల్: మండల పరిధిలోని వెలుగొమ్ములో తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొళాయిల ద్వారా ఇంటింటికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో పాటు, వేసవి కాలం కావడంతో గ్రామస్తులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మధ్య కాలంలో మిషన్ భగీరథ పైపులైన్లు అక్కడక్కడ మరమ్మతుకు గురికావడంతో రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోతుంది. కాగా రాబోయే ఏప్రిల్, మే నెలల్లో నీటి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉంది.

గ్రామంలో వనరుల పరిస్థితి ఇలా..

గ్రామంలో దాదాపు 15వందల జనాభా ఉంది. కాగా మిషన్ భగీరథ కింద కేవలం 330 నల్లా కనెక్షన్లు ఇచ్చారు. గ్రామం మొత్తం సరఫరా చేసేందుకు రెండు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు ఉన్నాయి. కాగా వీటి సామర్థ్యం 60వేల లీటర్లు, 72వేల లీటర్లుగా ఉంది. కాగా అధికారుల లెక్కల ప్రకారం గ్రామానికి రోజుకు 1.32 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంది. కానీ లక్షా 20వేల లీటర్లు మాత్రమే ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. కానీ వాస్తవానికి రోజుకి దాదాపు లక్షా 65 వేల లీటర్ల నీరు అవసరం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

⇨ గ్రామ పంచాయతీకి చెందిన రెండు బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నా మోటార్ లేకపోవడం వల్ల ఒకటి నిరుపయోగంగానే ఉంది. మరో రెండు జెట్ మోటార్లు ఉన్నా వాటిలో నీటి మట్టం తగ్గడం వల్ల ఇబ్బంది కలుగుతోంది. గ్రామంలో పంచాయతీకి ఉ న్న ఒక మోటార్‌తో ఒక్క ట్యాంక్ కూడా పూర్తిస్థాయిలో నిండడం లేదు. దీంతో ప్రజలు వ్యవసాయ బోర్ల దగ్గర నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా బోరుబావి

గ్రామంలో నీటి సమస్య ఉందని స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సొంత నిధులతో బోరు వేయించారు. చర్యలు చేపట్టి నెలరోజులు దాటినా నేటికీ బోరు మోటార్ బిగించలేదు. ఉన్న మరొకటి మరమ్మతుకు గురికావడంతో నీరు తక్కువగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

- పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు
- వెలుగొమ్ముల జనాభా 1454
- నల్లా కనెక్షన్లు 330



గ్రామంలోని నీటి ట్యాంకులు

చర్యలు తీసుకుంటున్నాం

గత రెండు రోజుల క్రితం ఊర్కొండ మండలంలో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ కావడంతో రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోయింది. గత వారంలో కొల్లాపూర్ దగ్గర రోడ్డు మరమ్మతుల వల్ల డ్యామేజీ కావడంతో సరఫరా నిలిచిపోయింది. తాత్కాలిక చర్యలు తీసుకున్నాం. మా పరిధిలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–లావణ్య, మిషన్ భగీరథ అధికారి, మిడ్జిల్ మండలం

నీరు తక్కువగా వస్తోంది



గ్రామంలో నల్లాల ద్వారా నీరు తక్కువగా వస్తోంది. ఐదు నుంచి పది బిందెలకు మించి రావడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. రాబోయే రోజుల్లో మరింత సమస్యగా మారే అవకాశం ఉంది. ముందస్తు చర్యలు చేపట్టాలి.

–మంజుల, వెలుగొమ్ముల

పొలాల వద్ద తెచ్చుకుంటున్నాం



ఇటీవల వారానికి రెండు రోజులు నల్లాలు రావడం లేదు. ఉన్న ఒక్క మోటార్‌తో ట్యాంకు నిండకపోవడంతో గ్రామ సమీపంలోని బాల్‌రెడ్డి వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. అధికారులు చర్యలు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలి.

–వెంకటమ్మ, వెలుగొమ్ముల

పశువులకూ ఇబ్బందే..



గ్రామంలో స్థానికులతో పాటు మూగ జీవాలకూ తాగునీటి ఇబ్బంది కలుగుతోంది. ఎండకాలం కావడంతో పశువులను, గొర్రెలను వ్యవసాయ పొలాల దగ్గరకు తీసుకెళ్లి నీరు తాగించాల్సి వస్తోంది. పంచాయతీ బోరు మోటార్ బిగిస్తే సమస్య తీరే అవకాశం ఉంది.

– కృష్ణయ్య, వెలుగొమ్ముల